మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## డాక్టర్ శ్రీనివాస చారికి ఎక్సలెన్సి అవార్డు


అవార్డు అందుకుంటున్న దృశ్యం

**నిజాంపేట, జనవరి 11, ప్రభాతవార్త :** నిజాంపేట మండల కేంద్రానికి చెందిన డాక్టర్ వీర్ల శ్రీనివాస చారికి బుధవారం రోజున హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన తెలంగాణ ఎలక్ట్రో హోమి యోపతి పితామహుడు డాక్టర్ కౌంట్ సీజర్ మెట్టె గారి 214వ జయంతి సందర్భంగా ఎక్సలెన్సి అవార్డు అందజేశారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలోని నిజాంపేట నర్సింగ్ హోమ్‌లో కోవిడ్- 19 సమయంలో ప్రజలకు సేవలందించినందుకు ఆయనకు అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు విశిష్ట వైద్య సేవలు అందించినందుకు ప్రత్యేక అవార్డును అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## డైరీ, క్యాలెండర్ అవిష్కరించిన కలెక్టర్


డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 11, ప్రభాతవార్త:** బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శరత్ చేతుల మీదుగా తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం డైరీ- 2023 క్యాలేండర్‌లను ప్రారంభించారు. ఈ డైరీ, క్యా లేండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవ సాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ డిగ్గెరి వైద్య నాథ్, ప్రధాన కార్యదర్శి ఎవిజికె ప్రసాద్, ఎడిఎ రామకృష్ణ, సురేష్ బాబు, సంఘం సభ్యులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అంజలి, సారికి, శ్రీకాంత్, శ్రీహరి, అనిత, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, ప్రవీణ్ చారి, ప్రమేలత, స్వాతి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు : మంత్రి హరీష్‌రావు

**చిన్నకోడూరు, జనవరి 11, ప్రభాతవార్త :**
చిన్నకోడూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.23 కోట్ల 49 లక్షల నిధులు మంజూరు వచ్చినట్లు రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యేండ్ల తరబడి మట్టి రోడ్లుగా ఉన్న చిన్నకోడూరు మండంలోని పలు గ్రామాల్లో మట్టి రోడ్లకు మహర్ధశ రానుందని తెలిపారు. త్వరలోనే మట్టి రోడ్లని బీటీ రోడ్లుగా మారనున్నాయి. మండలంలోని చిన్నకోడూరు మండల కేంద్రం నుంచి ఎల్లమ్మజాలుపోయే దారి యేండ్ల తరబడి మట్టి రోడ్డుగా ఉంది. ఈ రోడ్డులో అధిక శాతం రైతులు వస్తుపోతుంటారు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 85 లక్షలు నిధులు మంజూరు వచ్చినట్లు వివరించారు. ఓబులాపూర్ నుంచి కస్తూరిపల్లి మట్టి రోడ్డుకు రూ. 1 కోటి46 లక్షలు, పెద్దకోడూరు వయా రాజీవ్ రహదారి వరకు రూ. 1కోటి 42 లక్షలు, శంకరాయకుంట నుంచి గోనెపల్లి వరకు రూ.95 లక్షలు, మేడిపల్లి ఎస్సీ కాలనీ నుంచి రాజీవ్ రహదారి వరకు రూ.2 కోట్ల 37 లక్షల 50 వేల చొప్పులన బీటీ రోడ్లుగా మార్చడానికి నిధులు మంజూరు వచ్చినట్లు చెప్పారు. చంద్లాపూర్ బీసీ కాలనీ రోడ్డుకు రూ 1 కోటి 94 లక్షలు, మాచాపూర్ టూ రంగాయపల్లికి రూ.4 కోట్ల 40 లక్షలు, చెర్లఅంకిరెడ్డి పల్లి స్కూల్ నుంచి కస్తూరిపల్లి శివారు నుంచి సికింద్లాపూర్ వరకు రూ. 3 కోట్ల 62 లక్షలు, చిన్నకోడూరు, రామునిపట్ల నుంచి రాజీవ్ రహదారి వరకు రూ.2 కోట్ల 47 లక్షలు, అదిపెరుమాండ్లు అలయం రామంచ నుంచి గంగాపూర్ చౌరస్తా వరకు రూ. 2 కోట్లు చొప్పున నిధులు మంజూరు కావడంతో బీటీ రోడ్లుగా మారనున్నాయని తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టి రోడ్లును అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు.

## దేశానికి ప్రధానిగా సీఎం కేసీఆర్ కావాలి

### రాష్ట్ర సివిల్ సప్లయ్ ఛైర్మన్ రవీందర్ సింగ్

### - మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మలకు పూజలు


రేకులకుంట మల్లికార్జున స్వామిని దర్శించుకున్న రవీందర్ సింగ్

**దుబ్బాక, జనవరి 11, ప్రభాతవార్త:** 2024లో వచ్చే ఎన్నికల్లో దేశంలో మొత్తం బిఆర్ఎస్ పార్టీ గెలుపొంది, దేశానికి ప్రధానిగా సీఎం కేసీఆర్ కావాలని శ్రీ రెకులకుంట మల్లికార్జున స్వామిని, రేణుక ఎల్లమ్మను రాష్ట్ర సివిల్ సప్లయ్ ఛైర్మన్ రవీందర్ సింగ్ మొక్కుకున్నారు. బుధవారం దుబ్బాక పట్టణ పరిధిలో మల్లాయిపల్లిలో శ్రీ రెకులకుంట మల్లికార్జున స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాలను రాష్ట్ర సివిల్ సప్లయ్ ఛైర్మన్ రవీందర్ సింగ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు మల్లికార్జున స్వామిని ఎల్లమ్మ తల్లిని దర్శించుకోవాడం చాల సంతోషంగా ఉందన్నారు. దేవాలయం చాల అహ్లాదకరంగా ఉందని, దేవాలయం అభివృద్ధి చేందే విధంగా సిఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని రాష్ట్రల్లో గెలుపొంది సిఎం కేసిఆర్ దేశానికి ప్రధాన మంత్రి అయిన తరువాత మళ్లి దేవాలయానికి వచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకుంటానని తెలిపారు. గొల్లకుర్మ సంఘం రాష్ట్రం అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ఛైర్మన్ రొట్టె రామేష్, గ్రామాల సర్పంచులు పెరుగు పద్మపర్వాతాలు, సోమారపు స్వప్నస్వామి, ఆలయ ఒగ్గు పయావుల పోషయ్య, చెరుకురి రాజం, చిల్లా రాజు, పెరుగు కర్ణకర్, కొటి మల్లెషం, మొగుల్ల గోపాల్, చెరుకురి మల్లెషం, డైరెక్టర్లు చెట్టి దేవరాజు, చిర్ర తిరుపతి, కోమటిరెడ్డి రాజిరెడ్డి, చెల్ల రాజు, చెరుకురు భూపతి, పాతులోత్ బాలకిషన్, పర్స నరేష్ పాల్గొన్నారు.

## 24 గంటల్లో 25 ప్రసవాలు

### -ఎంసీహెచ్ ఆసుపత్రి వైద్యుల రికార్డు


చిన్నారులతో తల్లులు

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి11 ప్రభాతవార్త:**
మెదక్ మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఆసుపత్రిలో ఒక్క రోజులో 25 ప్రసవాలు జరిగాయి. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా గర్భిణుల కోసం ఎంసీహెచ్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రసవాల కోసం ప్రైవేటుకు కాకుండా ఈ ఆసుపత్రికే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో 24 గంటల్లో 25 ప్రసవాలు చేసి వైద్యులు రికార్డ్ సృష్టించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుండి బుధవారం ఉదయం 10 గంటల వరకు ఒక్క రోజులోనే 25 ప్రసవాలు జరిగాయి. అందులో 12 సాధారణ ప్రసవాలు కాగా, 13 సిజేరియన్ చేశారు. ముఖ్యంగా ఆసుపత్రి విభాగ అధిపతి గైనకాలజిస్ట్ డాక్టర్ శివదయాల్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ డాక్టర్ వసుధ, అనస్థీషియా సాగరిక, పిల్ల వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్‌రావు, స్టాఫ్ నర్సులు, నర్సులు, సపోర్టింగ్ స్టాఫ్, వైద్య సిబ్బంది 24 గంటలు శ్రమించి కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రసవాలు చేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆసుపత్రిలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఒక్క రోజులోనే 23 ప్రసవాలకు మించి జరగలేదని, ఒకే రోజు 25 ప్రసవాలు జరగడం ఆసుపత్రి రికార్డుగా పేర్కొన్నారు. ఎంసీహెచ్‌లో ఇది ప్రథమం అని, 25 ప్రసవాల్లో 17 మంది మగ పిల్లలు, 8 మంది ఆడపిల్లలు జన్మించినట్లు తెలిపారు.

## జహీరాబాద్‌లో చైన్ స్నాచింగ్

**జహీరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లో బుధవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణంలోని దత్తగిరి కాలనీలో బడంపేట రమ్య తన కుమారుడిని పాఠశాల నుంచి తీసుకురావడానికి వెళుతుండగా మాణయ్య మేస్త్రి ఇంటి సమీపంలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి మహిళ మెడలోని గొలుసును తస్కరించుకుపోయారు. హౌజింగ్ బోర్డు వెళ్లే దారిలోని అండర్ బ్రిడ్జి వద్ద నడుచుకుంటూ వెళుతున్న మహిళల నుంచి గొలుసులు దొంగతనానికి ప్రయత్నించిన దొంగలను ప్రతిఘటించి గొలుసును దోచుకుపోకుండా ఆ మహిళ కాపాడుకుంది. పట్టణంలో ఒకే రోజు వేరు వేరు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు యత్నాలు చోటు చేసుకున్నట్లు తెలుసుకున్న పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సిసి కెమెరాలు ఉన్న ఈ రోజుల్లో సైతం సైన్ స్నాచింగ్‌లకు అడ్డుకట్ట వేయకపోవడం విస్మయాన్ని కల్గిస్తోందని పట్టణ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

### అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**మెదక్ అర్బన్, జనవరి11 ప్రభాతవార్త:**
ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచవలసిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు, వేకెంట్ ల్యాండ్స్ లో ఎంక్రోచ్మెంట్ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ పన్ను, గ్రంథాలయ సెస్, హరితహారం, పట్టణ సుందరీకరణ, పార్కుల ఏర్పాటు, వైకుంఠధామాలు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణాల ప్రగతి, శానిటేషన్, చెత్త సేకరణ తదితర అంశాలపై మున్సిపల్ కమీషనర్లతో సుధీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిమాండ్ మేరకు పన్నుల వసూళ్లు ఆశాజనకంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేస్తూ బిల్ కలెక్టర్ల పర్యవేక్షణలో బృందాల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి లక్ష్యం మేరకు అసెస్‌మెంట్ చేసి పన్నుల వసూళ్లను రాబట్టాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంస్థల ఎంత మేర పన్నులు చెల్లించవలసి ఉన్నది, నోటీసులు ఇచ్చారా, వారి నుండి స్పందన ఎలా ఉన్నదో వెంటనే తనకు వివరాలు అందజేయాలని ఆమె ఆదేశించారు. మార్గదర్శకాల మేరకు ఇంటి నిర్మాణాల అనుమతులు ఇవ్వాలని, అక్రమ నిర్మాణాలు గుర్తించి తొలగించాలని సూచించా రు. అదేవిధంగా ప్రభుత్వ ఖాళీ స్థలాలను అక్రమించి డబ్బాలు, తదతర వాటిని నెలకొల్పిన వారి నుండి టాక్స్ వసూలు చేయడంతో పాటు వారి వివరాలను అందించాలని ఆదేశించారు. గ్రంథాలయ సంస్థ వారు లైబ్రరీ సెస్ కట్టాలని నోటీస్ ఇస్తున్నారని, డిమాండ్ మేరకు సెస్ వసూలు చేసి చెల్లించవలసిందిగా సూచించారు. మున్సిపాలిటీకి ఇంకా అవసరమున్న జేసీబీ, ట్రాక్టర్, డోజర్ వంటి వాహనాల కొనుగోలుకు కౌన్సిల్‌లో ప్రతిపాదనలు సమర్పించవలసిందిగా ప్రతిమ సింగ్ సూచించారు. మున్సిపల్ కమీషనర్లు కౌన్సిలర్ల వెంట వార్డులో తిరిగి శానిటేషన్ పనులు పరిశీలించాలన్నారు. ప్రతి వార్డులో తెలంగాణ క్రీడా ప్రాంగణం, పార్క్ ఏర్పాటు చేయడంతో పాటు ప్లేగ్రౌండ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ సుందరీకరణలో అభివృద్ధి పనులు చేపట్టేలా చక్కటి ప్రణాళికతో డీపీఆర్‌లు రూపొందించాలని ఆమె మున్సిపల్ కమీషనర్లకు సూచించారు. స్వచ్ఛభారత్ మరిన్ని అవార్డులు సాధించడానికి అన్ని విధాలా కృషి చేస్తూ అట్టి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మున్సిపల్ కమీషనర్లకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్లు జానకిరామ్ సాగర్, మోహన్, యాదగిరి, వెంకట్‌గోపాల్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే

# లక్ష్యంగా ముందుకుసాగుదాం

### డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి


సమావేశంలో కార్యకర్తను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా అందరం కలిసి ముందుకు సాగుదామని డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని తాడూరి బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రభుత ం, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు మండిపడుతున్నారని తెలిపారు. ఈనెల 26 నుంచి టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తలపెట్టనున్న హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు పాల్గొనా లని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏకతా టిపైకి తీసుకరావడంతో మండల కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాత ప్రజావ్యతిరేక విధానాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. రైతులకు తీరని అన్యాయం చేస్తున్న కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణ పాఠం చెప్పితీరుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరి బాలాగౌడ్, డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, బొమ్మల యాదగిరి, ఎం.డి. ఇమామ్ (అత్తు), నరసయ్యపంతులు, ముద్దం లక్ష్మీ, మజహార్ మాలిక్, శంకర య్య, తిరుపతిరెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య

### రవాణా రంగ కార్మికులపై

# కేంద్రం దుర్మార్గపు చట్టం

### ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య

**రామాయంపేట, జనవరి 11, ప్రభాతవార్త :**
రవాణా రంగ కార్మికుల పొట్టలు కొట్టడానికి కేంద్రప్రభుత్వం దుర్మార్గమైన చట్టం తీసుకువస్తుందని ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర మంగళవారం రామాయంపేట పట్టణానికి చేరుకుంది. ఈసందర్భంగా రామాయంపేట శివారులో ఆటో కార్మికులు పెద్దఎత్తున చేరుకొని అధ్యక్షుల వీరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి మెదక్ క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న ఆటో, ట్రాలీ ఆటో, లారీ, గూడ్స్ వాహనాలు, ప్రైవేటు బస్సు ఆపరేటర్లు, ఆర్టీసీ బస్సు ఆపరేటర్లతో పాటు వివిధ రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మారుమూల గ్రామాలకు ప్రయాణ సౌలభ్యం కల్పిస్తున్న ఆర్టీసీని పరిరక్షిస్తూ, బలోపేతం చేయాలని అన్నారు. ఈరెండు డిమాండ్లకు అడ్డంకిగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన మోటారు వాహనాల సవరణ చట్టం ఉందన్నారు. ఈ చట్టం రవాణా రంగ కార్మికులకు ఎంతో ప్రమాదకరమైందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం రోడ్డు ప్రమాదం జరిగితే విచారణ కూడా లేకుండా డ్రైవర్‌పై కేసు నమోదు అవుతుందన్నారు. ఈ మధ్య కాలంలో ఇన్సూరెన్స్ ప్రీమియం పెద్ద ఎత్తున పెంచడంతో, సాధరణ డ్రైవర్లు ప్రీమియం చెల్లిచలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రం తెచ్చిన నూతన చట్టం ప్రకారం ఎవరికి కూడా సొంత వాహనాలు ఉండవని, ఉన్నవాటిని కోటీశ్వరుల కంపెనీలకు అటాచ్ చేయాలని చట్టంలో ఉందన్నారు. బిజెపికి నమ్మి ఓటేస్తే, కార్మికుల పాలిట ఉరితాడుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ నూతన చట్టం ప్రకారమే ప్రతిరోజు వాహనాల ఫోటోలు తీస్తూ పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తూ దుర్మార్గపు చర్యకు పాల్పడుతుందని అన్నారు. వాహనాలకు జరిమానాలు విధించే పరిస్థితి తెలంగాణకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొందని, ఇది మోడీ చేసిన చట్టం ఫలితం అన్నారు. ఈ చట్టాన్ని అడ్డుకోవడానికి దేశవ్యాప్త ఉద్యమాలు రావాలని, అందుకే అన్ని రాష్ట్రాల్లో సిఐటియు ఆధ్వర్యంలో యాత్రలు చేపడుతున్నామన్నారు. యాత్రలు పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా రెండు గంటల పాటు రవాణా స్తంభింపజేస్తే కేంద్రం దిగివస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు బాలమణితో పాటు పలువురు ఆటో కార్మికులు, సుమో డ్రైవర్లు పాల్గొన్నారు.

## రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**గజ్వేల్, జనవరి 11 (ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ కమిటీ రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ సంస్థను రక్షించాలని రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ ఫెడరేషన్ సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రవాణా రంగ కార్మికుల సంఘర్షయాత్ర ఈనెల 3వ తేదీన ఖమ్మంలో రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ నాయకత్వంలో ప్రారంభమైన జీపుజాత వివిధ జిల్లాల్లో తిరుగుతూ గజ్వేల్ పట్టణానికి బుధవారం చేరుకోగా సిఐటియు గజ్వేల్ నాయకులు ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో స్వాగతం పలికారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడి ప్రభుత్వం తీసుకువచ్చిన మోటార్ వెహికిల్ చట్టం 2019 రవాణా రంగ కార్మికులకు, లారీ, కారు, డిసిఎం, గూడ్స్ వాహనాల యజమానులకు గుదిబండగా మారిందని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ బీమా పెన్షన్ అమలుచేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, రవి, నాయకులు వేణుగోపాల్, సాదక్, సంజీవరెడ్డి, కరుణాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, నర్సింలు, నరేందర్, జహంగీర్, అహ్మద్, కుతుబుద్దీన్, గిరిధర్‌రావు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలు మానసిక ఉల్లాసం, స్నేహభావం

# పెంపొందించడానికి దోహదం

### మెదక్ డీఎస్పీ సైదులు, కొల్చారం ఎంపీపీ మంజుల


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ సైదులు

**కొల్చారం, జనవరి11 ప్రభాతవార్త:** శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మెదక్ డీఎస్పీ సైదులు, కొల్చారం ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, స్థానిక సర్పంచి కరెంట్ ఉమలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొల్చారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యువజన దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీ బాల్ క్రీడా పోటీలను డీఎస్పీ సైదులు లాంఛనంగా ప్రారంభించారు. కొల్చారం జిల్ల పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యువజన దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మెదక్ డీఎస్పీ సైదులు, రూరల్ సీఐ విజయ్, ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, ఎంఈవో నీలకంఠం, సర్పంచి కరెంటు ఉమలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. డీఎస్పీ సైతులు వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా డీఎస్పీ సైదులు, ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాలలు మాట్లాడుతూ రోజు రోజుకు క్రీడలకు యువత దూరం అవుతూ అనేక రకాల శారీరక రుగ్మతలకు గురవుతున్నారని అన్నారు. నేటి యువత క్రీడల వైపు దృష్టి సారించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని అన్నారు. యువజన దినోత్సవం పురస్కరించుకొని యువతను ప్రోత్సహించాని క్రీడా పోటీలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ తారాసింగ్, పోలీస్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంధత్వ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

### మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ



మాట్లాడుతున్న ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ

**శివ్వంపేట, జనవరి11 ప్రభాతవార్త:** గ్రామాలలో అధిక శాతం ప్రజలు కంటిచూపు లోపంతో బాధపడుతున్నారని గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని రకాలుగా ఏర్పాట్లు పూర్తి చేస్తుందని, అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శివ్వంపేట మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం శివ్వంపేట మండల ప్రత్యేక సాధారణ సర్వసభ్య సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చందు నాయక్‌తో కలిసి ఎంపీపీ హరికృష్ణ మాట్లాడుతూ కంటి సమస్యలను దూరం చేయడానికి 250 కోట్ల రూపాయలతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ నెల 18న తేదీన ఉదయం 9.00 గంటలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా శివ్వంపేట, కొంతాన్‌పల్లి గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి కంటి పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టే రోజుల్లో సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లోని స్థానికులకు అందుబాటులో ఉండి ప్రజలకు కంటి పరీక్షలు చేయించాలని కోరారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం గ్రామంలో ఇంటి నెంబర్ ప్రకారం ఏ వార్డు ప్రజలకు ఏ రోజు కంటి పరీక్షలు చేయించుకోవాలో ఆశా వర్కర్లు టోకెన్లు అందజేస్తారని ఆయన అన్నారు. శివ్వంపేట మండలానికి 3500 మందికి కంటి అద్దాలు ఉచితంగా అందించనున్నట్లు ఆయన అన్నారు. కంటి వెలుగు కార్యక్రమానికి మండలంలో రెండు బృందాలు కంటి పరీక్షలు నిర్వహిస్తాయన్నారు. జిల్లా ప్రజలు కూడా కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమతో పాటు తమ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటూ పూర్తి సహకారం అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నర్సయ్య, ఎంపీడీవో నవీన్ కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి, మండల వైద్యాధికారిణి డాక్టర్ సాయిసౌమ్య, డాక్టర్ సంధ్య, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు లాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ఇంచార్జిని కలిసి మాజీ మంత్రి గీతారెడ్డి

**జహీరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మాణిక్‌రావు థాక్రేను బుధవారం మాజీ మంత్రి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జెట్టి గీతారెడ్డి కలుసుకున్నారు. హైద్రాబాద్‌కు మొదటి పర్యాయం వచ్చిన మాణిక్‌రావు థుక్రేను గాంధీ భవన్‌లో గీతారెడ్డి కలుసుకుని పూల బొకేను అం దించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులపై మాణిక్‌రావు థాక్రేతో చర్చిం చినట్లు గీతారెడ్డి ప్రకటించారు.


మాణిక్‌రావు థాక్రేకు పూల బొకేను అందచేస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో వెంకట శైలేష్

## పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీని జడ్పీ సిఇవో ఆకస్మిక తనిఖీ

**కొల్చారం, జనవరి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామాన్ని బుధవారం జెడ్పీ సీఈవో వెంకట శైలేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. పారిశుధ్య పనులను సరిగ్గా నిర్వహించాలని పంచాయతీకార్యదర్శి అరుంధతికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, గ్రామ కార్యదర్శి అరుంధతి తదతరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో విద్యార్థులు

**మెదక్ మున్సి పాలిటీ, జనవరి 11 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఇంటర్ కాలేజీ కరాటే పోటీల్లో మెదక్ చిందిన దినకర్ గోల్డ్ మెడల్, హైదరాబాద్‌కు చెందిన రాహుల్ యాదవ్ సిల్వర్ మెడల్‌తో ప్రతిభ కనబరిచారని రెన్‌జూకీ షోటోకాన్ కరాటే వ్యవస్థాపకులు, సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వారు నిర్వహించిన ఇంటర్ కాలేజీ కరాటే టౌర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ కరాటే పోటీలు హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్, సీతాఫల్‌మండిలో జరిగినట్లు పేర్కొన్నారు. రెన్‌జూకీ షోటోకాన్ కరాటే అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణ, కరాటే మాస్టర్ నవీన్, సతీష్‌గౌడ్, శరత్ కేఎంబీసీఎస్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నీ విజేత పాపన్నపేట జట్టు



విజేత పాపన్నపేట జట్టుకు బహుమతిని అందచేస్తున్న ఎస్ఐ

**పాపన్నపేట, జనవరి 11, ప్రభాతవార్త:** పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ టౌర్నమెంట్‌లో పాపన్నపేట జట్టు విజేతగా నిలచింది. పాపన్నపేట ఎస్ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కొనసాగిన కబడ్డీ పోటీల్లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన జట్లు రెండు రోజులు తలపడ్డాయి. పోటీల్లో పాపన్నపేట జట్టు మొదటి స్థానంలో నిలువగా రెండవ స్థానంలో రాజ్యాతండా దక్కించుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీలను క్రీడాకారులు అపజయాన్ని విజయానికి నాంధి చేసుకోవాలని సూచించారు. ఓటమికి గల కారణాలను బేరీజు వేసుకుని మునుమందు జరిగే పోటీల్లో ఆ తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పాపన్నపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిసింగ్, నోడల్ అధికారి అంజాగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు మనోహార్, వినోద్, ప్రభాకర్, ప్రసాద్, మదు, రవి, చంద్రమోహన్, పోలీసు సిబ్బంది వీరప్ప, బసవరాజు, దుర్గ ప్రసాద్, రాజు వెంకటేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపీపీ నవనీత రవి

**మనోహరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పురం నవీనతరవి కోరారు. బుధవారం మనోహరాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంటివెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి వంద రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి కావాల్సిన కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. కంటి వ్యాధులు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**కొల్చారం, జనవరి11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రెండవ విడత ఏకరూప దుస్తులను సర్పంచి కుకునూరు మంజుల సత్యనారాయణగౌడ్, ప్రధానోపాధ్యాయురాలు ఏజీఎస్ సుల్తానాల చేతుల మీదుగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా సర్పంచి మంజుల మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల్లో సమానత్వం కోసం, అలాగే పేద విద్యార్థుల కోసం ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి కొంగోడ్ గ్రామ బూత్ కమిటీ ఎన్నిక

**కొల్చారం, జనవరి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడ్ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బూత్ అధ్యక్షులుగా వంజరి ఏగొండ, ప్రధాన కార్యదర్శిగా సాలె సత్యనారాయన, ఉపాధ్యక్షులుగా పిచ్చకుంట్ల యాదగిరి, ధరణి మహిపాల్, కార్యదర్శులుగా గుర్రాల మధు, వంజరి మహేష్, బూత్ సోషల్ మీడియా కన్వీనర్‌గా వంజరి సంజీవులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన బూత్ కమిటీ

# జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలి

### టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



ముఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్, జనవరి 11, ప్రభాతవార్త:** టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 26వ తేదీనుండి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందేవిదంగా కాంగ్రెస్ ఎంతగానో కృషి చేయడం జరిగిందని చెప్పారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఇచ్చిన హామీలను ఒక్కటికూడ నెరవేర్చకుండా పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, మోసాలను ప్రజలకు వివరించేందుకు ఏఐసిసి ఆదేశాల మేరకు టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రెండు నెలలపాటు రాష్ట్రంలో ఈ యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. యాత్ర విజవంతం చేయడానికి బ్లాక్ కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పని చేయాలని రాజిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టిపిసిసి నాయకులు ఆంజనేయులుగౌడ్, సోమన్నగారి లక్ష్మిరవిందర్‌రెడ్డి, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేషం, ఎన్ఎస్‌యుఐ వర్కింగ్ ప్రసిడెంట్ మణిదీప్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, సురేశ్‌నాయక్, ఉదయ్‌కుమార్, నరేశ్‌కుమార్, నర్సింలు, రాజు, కృష్ణ, దశరథగౌడ్, శేఖర్‌గౌడ్, అజ్మత్, రశీద్, ఎ, మల్లేష్‌యాదవ్, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయ నిర్మాణంలో స్లాబ్ పనులు ప్రారంబించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

## అందరి సహకారంతో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**నర్సాపూర్, జనవరి 11, ప్రభాతవార్త:** పట్టణ సమీపంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిలోని పంది వాగు వద్ద నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములవుదామని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, అన్నారు. బుధవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డితో కలిసి ఆలయ నిర్మాణ స్లాబ్ పనులను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ. 4 కోట్ల రూపాయిల వ్యయం అవుతుందన్నారు. సంక్రాంతి పండగ తర్వాత ఇంజనీర్లను పిలిపించి శబరి మల అయ్యప్ప స్వామి ఆలయం తరహాలోనే ఇక్కడ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, శివాలయం పూజారి వీరప్పగురుస్వామి ,అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీధర్‌గుప్త, టిఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, నాయకులు కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, రాకేశ్‌గౌడ్ , అయ్యప్ప స్వాములు కరుణాకర్‌రెడ్డి, పెద్ద రమేశ్‌గౌడ్, దేవాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మరకత మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు

**నర్సాపూర్, జనవరి 11 .ప్రభాతవార్త:** శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మరకత మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు నర్సాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు వైభవంగా సాగింది. కాగా బుధవారం చివరిరోజున రేణుక ఎల్లమ్మదేవికి అభిషేకం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు శ్రీమల్లిఖార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి హరిప్రసాద్‌శర్మ జాతర నిర్వాహకులు యాదవ సంఘం సభ్యులు మాజీ ఎంపిటీసి మాచునూరి మల్లేష్‌యాదవ్,పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్,,రాములుయాదవ్, రమేశ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, ఎద్దు మల్లేష్‌యాదవ్,చంద్రయ్య యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ దేవేందర్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్,సురేశ్‌యాదవ్ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండల వైద్యాధికారికి సన్మానం

**జగదేవ్‌పూర్, జనవరి 11 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారి డాక్టర్ సత్యప్రకాష్‌ను జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల కోశాధికారి కొంపల్లి శ్రీనివాస్‌ముదిరాజ్, మండల ఉపాధ్యక్షుడు రొయ్యల కర్ణాకర్‌ముదిరాజ్, పిట్ల నర్సింలుముదిరాజ్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి, లింగారెడ్డిపల్లి ఉపసర్పంచ్ బాలకిషన్‌ముదిరాజ్, ముదిరాజ్ యూత్ నాయకులు క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

## నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవు : డిఎల్‌పివో వేదవతి

**జగదేవ్‌పూర్, జనవరి 11 (ప్రభాతవార్త):** గ్రామపంచాయతీలలోని నిధులను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని గజ్వేల్ డివిజనల్ పంచాయతీ అధికారిణి వేదవతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మునిగడప గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు మునిగడప గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బుధవారం విచారణకై గ్రామాన్ని సందర్శించి రికార్డులను స్వాధీనం చేసుకొని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నిధుల దుర్వినియోగం అయినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. తదనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలను కిందిస్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్లె తిరుపతి, సర్పంచ్ బాల్‌లక్ష్మిఐలయ్య, మాజీ సర్పంచ్ పబ్బ రవి, బిజెవైఎం మండల అధ్యక్షుడు గుర్రం శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ బాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు మణికాంత్

## విద్యార్థులతో ఇంటర్‌బోర్డు చెలగాటం...

**గుర్తింపు లేని కాలేజీ విద్యార్థులను ఇతర కాలేజీల్లో చేరాలంటూ ఒత్తిడి...**
**జూన్‌లో చెప్పాల్సిన విషయం జనవరిలో చెప్పడంపై విద్యార్థుల ఆందోళన...**
**ఈ పద్దతిని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్**
**ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి మణికాంత్**

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 11, ప్రభాతవార్త :** విద్యార్థులతో ఇంటర్ బోర్డు చెలగాటం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి మణికాంత్ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో గుర్తింపు లేని కాలేజీ వివరాలు పంపకుండా ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించిన తరువాత గుర్తింపు ఉన్న కాలేజీలకు వెళ్లాలని విద్యార్థులను ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఇంటర్‌బోర్డు ఇలా చెలగాటం ఆడడంతో వేల మంది విద్యార్థులు నష్టపోతారని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు గుర్తింపు వున్నాయా, లేవా అనేది చెప్పకుండా జూన్ నెలలో అడ్మిషన్ చేసుకున్నారని, ఇప్పుడేమో వాటికి గుర్తింపు లేదని గుర్తింపు ఉన్న కాలేజీలకు వెళ్లాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాలేజీ యాజమాన్యాలు చెప్పలేవని ఇప్పుడు ఎటుపోవాలి అని, విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. 25 కాలేజీలకు గుర్తింపు లేదని ఇప్పుడు ప్రకటించడంఅంటే విద్యార్థులతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఇప్పటికే ఫీజు చెల్లించారని, గుర్తింపు ఉన్న కాలేజీలకు వెళ్లిన ఫీజు కట్టాలని చెప్పడంతో ఇంటర్‌బోర్డు పనితీరు పట్ల ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ పద్దతి ఉపసంహరించుకోవాలని, వచ్చే విద్యా సంవత్సరంలో ఈ మార్పులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షం లో ఇంటర్‌బోర్డు కార్యాలయం ముట్టడికి ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు నిఖిల్, అజయ్, అరుణ్,విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం

**నర్సాపూర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఈనెల 12న పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. 12వ తేదీ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సిఐ షేక్‌లాల్ మధార్ ముఖ్య ఈతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈమేరకు ఆసక్తి గల నాయకులు, యువకులు. పెద్దలు అధిక సంఖ్యలో రక్తదాన శిబిరంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ గంగరాజు కోరారు.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ఇన్‌స్పైర్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

**జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు..దక్షిణ భారత స్థాయికి రెండు ఎంపిక**

**మెదక్ మున్సి పాలిటీ, జనవరి11 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ఇన్స్‌పైర్ ప్రదర్శనలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ఇన్స్‌పైర్ ప్రదర్శనలో జిల్లా విద్యార్థులు జాతీయ స్థానికి ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్స్‌పైర్ ప్రదర్శనలో నందిని జెడ్పీహెచ్ఎస్ నాగ్సాన్‌పల్లి విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికైందని, జెడ్పీహెచ్ఎస్ టి. లింగంపల్లి విద్యార్థిని భాగ్యలక్ష్మీ రూపొందించిన ప్రాజెక్టు దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు వారు తెలియజేశారు. వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో సిద్ధార్థ రూరల్ హై స్కూల్ విద్యార్థిని వి. పూజ తృతీయ స్థానం, సైన్స్ క్విజ్‌లో మొదటి స్థానం పొందినట్లు తెలిపారు. జెడ్పీహెచ్ తూప్రాన్ (బాయ్స్) ఉపాధ్యాయురాలు రజిత రూపొందించిన టీచర్ ఎగ్జిబిట్ దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను జిల్లా కలెక్టర్ హరీష్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, రమేష్‌లు అభినందించారని వారు తెలియజేశారు.



రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ఇన్స్‌పైర్ ప్రదర్శనలో ప్రతిభ చూపిన జిల్లా విద్యార్థులు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## దళితబంధు పేదలకు ప్రాధాన్యతనివ్వాలి

**ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షుడు**

**మెదక్ మున్సి పాలిటీ, జనవరి 11 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, జాతీయకార్యదర్శి ఎర్ర యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని ఎమ్మార్పీఎస్ ప్రవేశపెట్టినప్పుడే ఆహ్వానించిందన్నారు. రూ.10 లక్షలు ఇచ్చి నిలదొక్కుకునేలా చేశారన్నారు. ఈ పథకం అమలులో అనేక చీకటి కోణాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులైన వారిని గుర్తించి జనాభా దామాషా ప్రకారం దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో ఎమ్మెల్యేల ప్రమేయాన్ని తొలగించాలని, జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. దళితబంధు పథకంలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలన్నారు. దళితబంధు పథకాన్ని దరఖాస్తు చేసుకునే విధంగా ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత జనాభా దామాషా ప్రకారం నిరుపేదలైన దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్రోళ్ల సంజీవులు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు గుడ్డి కృష్ణ, జిల్లా కార్యదర్శి సిద్దిరాములు, డప్పు రాములు, శంకరంపేట మండల అధ్యక్షులు జనార్ధన్, నిజాంపేట పట్టణ అధ్యక్షులు ఏసు, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు పుర్ర మహేష్, రాములు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం



స్వయం పరిపాలనా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నర్సాపూర్, జనవరి 11, ప్రభాతవార్త:** మండలపరిధిలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులుగా పవిత్ర, ఆర్జెడిగా ప్రణయ్, డిఇఓగా జస్వంత్, ఎస్ఓగా గౌతమ్‌గౌడ్, ఎంఇఓగా శివకుమార్ వ్యవహరించగా ఉపాధ్యాయులుగా వందన, శరణ్య,అంజు, వాసు, వేణు, సాయి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధా, వెంకటేశ్, రాదిక, శ్రీనివాస్‌గౌడ్, వాణి, ప్రదీప్‌రెడ్డి, కనకరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యానికి ఎల్‌వోసీ అందజేసిన ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**మనోహరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన సాహెబ్‌రావు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం స్థానిక నేతలు ఫారెస్ట్ డెవెలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2,50,000 ఎల్‌వోసీని బుధవారం కూచారం సర్పంచి నరేందర్‌రెడ్డి, నరేష్ ముదిరాజ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మనోహాబాదర్ ఎంపీపీ పురం నవీనత రవి, కాళ్లకాల్ మాజీ ఉప సర్పంచి కాళిదాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రేపు కంటి వెలుగుపై ప్రత్యేక సమావేశం : ఎంపిడివో

**కొల్చారం, జనవరి 11 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై ఈనెల 13వ తేదీన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్చారంలోని మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, వైద్యాధికారులు, పంచాయితీ కార్యదర్శులు హాజరు కావాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలి

**నర్సాపూర్, జనవరి 11, ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి విష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్ అన్నారు. బుదవారం విష్ణు ఉన్నత పాఠశాలలో 20వ వార్షికోత్సవంలో బాగంగా బివిరాజు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అనంతరం గత సంవత్సరంలో పదవ తరగతిలో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బివిఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, విష్ణు పాఠవాల ప్రధానోపాధ్యాయులు జామి, మేనేజర్ బాపిరాజు, ఏఓ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వాహనాలు వద్దు..ఆర్టీసీ బస్సు ముద్దు

**చిన్నశంకరంపేట, జనవరి 11, ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సులలో ప్రయాణించండి సంస్థ అభివృద్ధికి పాటు పడండి అంటూ బుధవారం కళాకారులు మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో ప్రదర్శనను నిర్వహించారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవలను, రాయితీలను ఆట,పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేటు వాహనాలలో ప్రయాణం సురక్షితం కాదని, మీ గమ్య స్థానాలకు సురక్షితంగా చేరాలంటే ఆర్టీసీ బస్సులలో మాత్రమే ప్రయాణించాలని వారు సూచించారు. కార్యక్రమంలో కళా బృందం ఇంచార్జి సంపత్, కళాకారులు శ్రీహరి, గోపన్న, వేణుగోపాల్, సురెందర్ ఉన్నారు.




ఆర్టీసీ సేవల గురించి ప్రజలకు విన్నవిస్తున్న కళాకారులు

## గుండెపోటుతో బిజెపి నేత మాదరి మాణయ్య మృతి

**కొల్చారం, జనవరి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మాదారి మాణయ్య మంగళవారం గుండెపోటుతో మరణించారు. బుధవారం స్వగ్రామం ఎనగండ్లలో మాదయ్య అంత్యక్రియలు జరిగాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొని మాదయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ అంత్యక్రియల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# 'కంటివెలుగు'ను విజయవంతం చేయాలి : జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 11, ప్రభాతవార్త**

ఈనెల 18న జరగబోయే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్ గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. శాఖల వారీగా చేయవలసినటువంటి పనులను నిర్లక్ష్యం వహించకుండా, పద్దతి ప్రకారం పట్టణంలోని కంటి వెలుగు కేంద్రాలను విజయవంతంగా నడిపించాలన్నారు. అన్ని వార్డుల ప్రజలకు కంటివెలుగు సమాచారాన్ని అందించాలన్నారు. అందుకు చరవాణి ద్వారా, సోషల్ మీడియా ద్వారా, గ్రూపులతో పాటు ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికి సమాచారం చేరవేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని, కంటి చూపు సరిగా కనబడని వారిని కంటి వెలుగు కేంద్రాలకు తీసుకు వచ్చి, పరీక్షాకేంద్రాలలో వైద్యం చేయించాలన్నారు. అంతేకాకుండా వారిని సురక్షితంగా ఇంటికి చేరవేయాల్సిన బాధ్యత మనదే అని చైర్మెన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల కమిషనర్ బి.యాదగిరి, ధర్మారం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ, హెల్త్ సూపర్‌వైజర్ సునంద, సత్యవతి, కౌన్సిలర్‌లు బొర్ర అనిల్‌కుమార్, సుందర్ సింగ్, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, చిలుక గంగాధర్, మున్సిపల్ ఏఈ సాయిరాం రెడ్డి, నాయకులు చంద్రపు కొండల్‌రెడ్డి, మల్యాల కిషన్, దేవుని రాజు, చింతల యాదగిరి, సరాఫ్ శ్యామ్, వార్డు ఆఫీసర్లు శివరాజ, శ్రీనివాస్, వెంకటస్వామి, కరుణాకర్, ఎల్లయ్య, బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, మెప్మా ఆర్‌పిలు మర్కు లావణ్య, రజిత, వసంత, రూప, స్వాతి, స్రవంతి, ఆర్. లావణ్య, విజయశ్రీ, కవిత, తరంగిణి, బాల్‌లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సతీష్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

## పెద్ద పండగకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

**కోహెడ, జనవరి 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కూరెల్ల గ్రామంలో వచ్చేనెల మొదటివారంలో పెద్దమ్మ పండగ మహోత్సవానికి ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం సర్పంచ్ గాజుల రమేష్ ఆధ్వర్యంలో కూరెల్ల ముదిరాజ్ పెద్దలు హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌ను కలిసి పెద్దమ్మ పండుగ మహోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. పెద్దగుడి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని సర్పంచ్ ఎమ్మెల్యేను కోరగానే వెంటనే స్పందించిన ఆయన తన వంతు సహాయంగా రూ.1,50,000 అందజేశారు. గుడి అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే సతీష్‌కు సర్పంచ్‌తో పాటు ముదిరాజ్ కుల పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఈగ మల్లయ్య, బైరి సంపత్, పోలవేని బాబు, పిట్టల శ్రీకాంత్, ఈగ నాగరాజు, దండవేని పోచమల్లు, గౌరవేని సంపత్, బైరి రాజయ్య, ఈగ రాజయ్య, ఈగ కొమురయ్య, ఈగ సంజీవ్, కనకయ్య, దండవేణి రామచంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగ్గుల పోటీలు




ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**కొండపాక, జనవరి 11, ప్రభాతవార్త :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా దుద్దెడలోని సాయికృప పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ విశిష్టతను మహిళలకు, విద్యార్థులకు ఉపాధ్యాయులకు వివరించారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పల్లె జానకీ, ద్వితీయ బహుమతి తాటోజి విజయలక్ష్మి, తృతీయ బహుమతిని తిరుపతి దివ్య అందుకున్నారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు పాఠశాల యాజమన్యం వెంటి బహుమతులను అందించారు. పోటీల్లో పాల్గొన్న రేణుక, లక్ష్మి,లాస్య కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అరెపల్లి మమదేవ్ గౌడ్, ఉప సర్పంచు గుండెల్లి అంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, ఎఓ ప్రియదర్శిని, ఎఈఓ సంధ్య, పాఠశాల హెచ్ఎం వనజ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కుల గణన చేసే వరకు పోరు ఆగదు....

**-బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగ్గోజు సుదర్శనాచారి**



మాట్లాడుతున్న ఎగ్గోజు సుదర్శనాచారి

**హుస్నాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** జనగణలో భాగంగా కుల గణన నిర్వహించేవరకు పోరు ఆగదని బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగ్గోజు సుదర్శనాచారి అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఎన్నిమార్లు పోరాటం చేసినా మొండిగా వ్యవహరిస్తున్న తీరుపై ఈ మారు చేసే ఉద్యమం సాధించుకునే వరకు కొసాగిస్తామని ప్రతినబూనారు.ఈ తరహ బిజెపి విధానంపై జరగబోయే ఎన్నికల్లో పతనం తప్పదని జోస్యం చెప్పారు.బీహార్ రాష్ట్రంలో కులగణన చేపట్టిన అదే పద్దతిన తెలంగాణ రాష్ట్రంలో సైతం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.కులగణన చర్య ద్వారానే వెనకబడనతరగతుల ప్రజలకు తగిన సామాజికన్యాయం జరుగతుందని అన్నారు.రాష్ట్రప్రభుత్వాలు సైతం బడ్జెట్‌నిధుల్లో అధికశాతం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వంగోజు భాస్కరాచారి,సంఘనాయకులు తిప్పారపు రమేష్ పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకను వచ్చే నెల 6వ తేదీన అక్కన్నపేట మండలంలోని చౌడుతండాలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు దరావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే జయంతి కార్యక్రమానికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఈ వాల్ పోస్టర్‌ను తిరుపతినాయక్‌తో కలసి హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బీల్‌నాయక్, భీమదేవరపల్లి మాజీ జడ్పిటిసి మాలోతు రాంచందర్‌నాయక్,గుగులోతు రాజునాయక్,లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు భూక్య తిరుపతినాయక్‌తో పాటు పాల్గొన్నారు.

## బిజెపి మండల కమిటీ ఎన్నిక

**అక్కన్నపేట, జనవరి 11, ప్రభాతవార్త :** బిజెపి మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి తెలిపారు. పార్టీ మండల ఉపాధ్యక్షునిగా జంగపల్లి శ్రీనివాస్, మడక రవికుమార్‌లను, కార్యదర్శులుగా బొక్కం గణేష్, కాశబోయిన సుమన్, బసిరెడ్డి రాకేష్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వినర్‌గా ఎడల హరికృష్ణ,ఓబిసి మోర్చ మండల అధ్యక్షులుగా జంగపల్లి యాదగిరి,ఓబిసి మోర్చ ప్రధాన కార్యదర్శులుగా గొర్ల రమేష్,కందారపు రమేష్‌లను నియమించడం జరిగిందన్నారు.అనంతనం నూతనంగా ఎన్నికైన నాయకులకు మండల అధ్యక్షుడు వీరాచారి పార్టీ కండువాలు కప్పి నియామక పత్రాలను అందజేవారు.రానున్న రోజుల్లో హుస్నాబాద్ గడ్డపై కాషాయం జెండా ఎగిరే విధంగా నాయకులు కృషిచేయాలని ఆకాంక్షించారు.



నియామక పత్రాలు అ ందిస్తున్న మండల అధ్యక్షుడు వీరాచారి

# మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

### దేవాలయ చైర్మన్ గీస బిక్షపతి




మాట్లాడుతున్న గీస బిక్షపతి

**కొమురవెల్లి, జనవరి 11, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి దేవస్థానం పాలక మండలి సభ్యులు బుధవారం చైర్మన్ గీస బిక్షపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జూనియర్ అసిస్టెంట్ ఇ. సందీప్‌కుమార్‌పై సర్వీసు రూల్స్ ప్రకారం క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని, దేవాలయానికి మంజూరు వచ్చిన ఖాళీగా ఉన్న డోలు, శృతి పోస్టుల నియామకం ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తీర్మానించారు. అలాగే గంగిరేగుచెట్టు మహా మండపంలో కోతలు రాకుండా జాలీలు ఏర్పాటు చేయాలని శ్రీస్వామివారికి బంగారు రుద్రాక్ష మాల, కోర మీసం, లింగముకాయ, అమ్మవార్లకు బంగారు కిరీటాలు తయారుచేయించడానికి తీర్మాణాలు చేశారు. దాసారం గుట్ట స్థలాన్ని ల్యాండ్ అక్విజేషన్ ద్వారా ఖరీదు చేయడానికి స్వామి వారి భక్తుల సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో ఉన్న రెండు బోర్లను డ్రిల్లింగ్ చేయడంకోసం తీర్మానించారు. మొక్కుబడి టికెట్స్(పట్నాలు) ధరల పెంపుదల, వాకీటాకీలు ఖరీదు, నూతనంగా గోశాలనిర్మాణం, కేతమ్మ బ్లాక్ ధర్మశాలల వెనుక సీసీ ఫ్లోరింగ్ చేయడానికి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కృషిచేయడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడడమే పాలక మండలి మొదటి కర్తవ్యమన్నారు. సమావేశంలో ఈవో బాలాజీ, ధర్మకర్తలు మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్, నర్ర రఘువీరారెడ్డి, చెట్కూరి తిరుపతి, కాసర్ల కనకరాజు, జాటోత్ స్వప్న, ఎర్రగొల్ల మల్లేశం, కందుకూరి సిద్దిలింగం, కొంగరి శ్రీధర్, గడ్డం మహేశ్‌యాదవ్, పచ్చిమడ్ల సిద్దిరాములుగౌడ్, సూటిపల్లి బుచ్చిరెడ్డి, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, అలయ సిబ్బంది పాల్గొన్నారు.



మన ఊరు మన బడి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

## ప్రైవేటుకు ధీటుగా మారనున్న ప్రభుత్వ పాఠశాలలు

**మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**బెజ్జ ంకి, జనవరి 11, ప్రభాతవార్త :** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అన్ని రకాల సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు మారబోతున్నాయని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని రేగులపల్లి గ్రామంలో మన ఊరు మన డి పథకంలో భాగంగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పలు అభివృద్ధి పనులను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మారుస్తూ డిజిటల్ తరగతులతో పాటు మంచి అహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే మండల కేంద్రంలోని స్థానిక ఎంపడితో కార్యాలయం అవరణలో కల్లెపల్లి, బెజ్జంకి,దాచారం,గుగ్గిల్ల, పెరుకబండ, గాగిల్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు లింగాల నిర్మల, కచ్చు రాజయ్య, పాకాల మహిపాల్‌రెడ్డి, ద్యావనపల్లి మంజుల, దారం లక్ష్మీ,శీల లక్ష్మీ, కర్రావుల సరోజన, జెల్ల ఐలయ్య, పెంటమీది శ్రీనివాస్‌గౌడ్, అన్నాడి సత్యనారాయణరెడ్డి, దుంబాల మహేందర్ రెడ్డి, పావని, లక్ష్మన్, తిరుపతి, శ్రీనివాస్, మల్లేశం, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాకారులను సన్మానించిన ఎంపి



జాతీయ క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపి ప్రభాకర్‌రెడ్డి

**మిరుదొడ్డి, జనవరి 11, ప్రభాతవార్త :** జాతీయ స్థాయి క్రీడాపోటీలకు మిరుదొడ్డికి చెందిన అందె చేతన్, గొట్టం నవీన్, వేముల యువతేజ, మద్దెల పర్శరాములు, అందె పవన్‌లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 13 నుంచి 17 వరకు కర్ణాటకలోని మంగళూర్ యూనివర్శిటీలో జరిగే జాతీయ యూనివర్శిటీ పోటీలలో పాల్గొంటారు. మండల కేంద్రం నుంచి జాతీయ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మెదక్ ఎంపి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఘనంగా సత్కరించారు. మండల కేంద్రం నుంచి క్రీడాకారులు జాతీయ క్రీడ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కర్ణాటకలో జరిగే జాతీయ పోటీలలో రాణించి తెలంగాణ పేరును నిలబెట్టాలన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జాతీయ స్థాయిలో పోటీపడేలా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన మాజీ ఎంపిటిసి బైరయ్య ను అయన అభినందించారు. కార్యక్రమంలోఎఎంసి చైర్మన్ వల్లాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ చల్లురి మల్లేశం, బిఆర్ఎస్ నాయకులు సిద్ది భూపతి పాల్గొన్నారు.

## కల్తీ కాదు..బ్రాండెడ్ నూనెలే అమ్ముతున్నాం

**-కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు బెజుగం బాలకిష్టయ్య**

**హుస్నాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో విక్రయించే నూనెలు కల్తీవికాదని, బ్రాండెడ్ కంపనీలవేనని హుస్నాబాద్ కిరాణావర్తక సంఘం అధ్యక్షుడు బెజుగం బాలకిష్టయ్య అన్నారు.బుదవారం రోజున ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ కిరాణావర్థక సంఘంలో ఎవరూ కల్తీ నూనెలు తయారు చేయడం లేరని,కొంత మంది పనిగట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.తాము అమ్మె నూనె ప్యాకెట్లు,డబా ్బలపై తయారీ దారుల వివరాలతో పాటు లైసెన్సు ముద్రణ ఉంటుదన్నారు.

## పెంటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**ములుగు, జనవరి 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బహిలంపూర్ గ్రామానికి చెందిన చిన్నెల్లి పెంటయ్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ ఎంజాల ఐలయ్యయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. పెంటయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కొమురయ్యయాదవ్, బాల్‌నర్సింలు, నర్సింలు ఉన్నారు.



నూతన బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

## దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

**దుబ్బాక, జనవరి 11, ప్రభాతవార్త:** దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో ధర్మాజీపేట వార్డులోని సుమారు రూ. 7 లక్షల 60 వేలతో నూతనంగా నిర్మించిన రెండు బస్ షెల్టర్‌లను ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో ధర్మాజీపేట వార్డులో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రెండు బస్టాండ్‌లను సొంత నిధులతో నిర్మించి ఇచ్చానన్నారు. ధర్మాజీపేట వార్డులో ప్రజలకు త్వరలో మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు బాల వికాస్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ గ్రామానికి బస్సులు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే సిద్దిపేట డిపో మేనేజర్‌తో మాట్లాడి సంక్రాంతి పండుగ తర్వాత నుండి ధర్మాజీపేట గ్రామానికి ప్రతి రోజు రెండు బస్సులు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే పాఠశాలల అభివృద్ధి

**-ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్**



కర్కపట్ల పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కృష్ణయాదవ్

**మర్కుక్, జనవరి 11 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం పాఠశాలలో కలియతిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం తమ నిధుల నుండి 50వేలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని అంతర్గత మురికికాల్వల నిర్మాణానికి లక్షా 79వేలు, దామరకుంట ప్రాథమిక పాఠశాలకు లక్షా 50వేలు, కాశిరెడ్డిపల్లి పాఠశాలకు లక్షా 50వేల చొప్పున మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. తమ పరిధిలోని గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వీరితో పాటు కర్కపట్ల సర్పంచ్ నర్సింలు, ఉపాధ్యాయులు స్వప్న, ప్రకాష్‌రావు, మధు, నాయకులు ఐలేని, రాజు, గణేష్, సంతోష్ ఉన్నారు.

## ఘనంగా గోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం

**సిద్దిపేట రూరల్, జనవరి 11, ప్రభాతవార్త :** జిల్లా కేం ద్రంలోని గణేష్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం గోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండుగా నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకులు చిలకమర్రి వెంకటరమణా చార్యుల అధ్వర్యంలో ధనుర్మాసం పురస్కరించుకొని శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం తిరుప్పావై సేవాకాలం, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కుడారై సందర్భంగా 108 గంగళలలో క్షీరాన్నం ప్రసాద స్వామి వారికి నివేదన చేశారు. వేద మంత్రోచ్చరణ మధ్య ఘనంగా వేడుకగా గోదా కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.



గోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

# రైతులకు తప్పని విద్యుత్ కష్టాలు

**కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు పట్టించుకోని అధికారులు ఎండిపోతున్న పంట పొలాలు.. ఆందోళనలో రైతులు**

**కోహెడ, జనవరి 11, ప్రభాతవార్త :** నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని..రైతులకు ఎట్టి పరిస్థితుల్లో కరెంటు కష్టాలు రానిచ్చే ప్రసక్తేలేదని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో కరెంటు సమస్యలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. గ్రామ శివారులో సుమారు 30 మంది రైతుల పొలాలకు కలిపి ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఓవర్ లోడ్‌తో తరచూ కాలిపోతుందని రైతులు వాపోతున్నారు. దీంతో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం టీడీఎస్‌లు కట్టినా అధికారులు మాత్రం పట్టించుకోవం లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌లతో పాటు ఓవర్ లోడ్‌తో వ్యవసాయ మోటార్లు కాలిపోతుండడంతో మరింత అప్పుల పాలు కావాల్సి వస్తుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతూ మరమ్మతు చేయడంలో విద్యుత్ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని రైతులు అంటున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్ చేసి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని లేదంటే రైతుల కష్టం అంతా వృధా అవుతుందని వాపోతున్నారు. కరెంటే లేక పంటలు నష్టపోయే పరిస్థితి వచ్చిందని రైతులు తెలిపారు.



కరెంటు కోతలతో ఎండిపోతున్న వరి పొలం



లాల్‌బహదూర్‌శాస్త్రికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు

## లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళులు

**హుస్నాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** భారతదేశ రెండవ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి 57వ వర్ధంతి వేడుకలు హుస్నాబాద్‌లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించుకున్నారు. బుధవారం అంబేద్కర్ విగ్రహంవద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హాజరైన టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో ఉప్పుసత్యాగ్రహం, క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అనంతరం స్వాతంత్ర్యం సిద్దించిన కాలంలో ఆయనను కేంద్రమంత్రి పదవిలో రైల్వే ప్రమాద ఘటన సంభవించగా నైతికబాధ్యతగా లాల్‌బహదూర్‌శాస్త్రి రాజీనామా చేశారని ఆయన నిస్వార్థ సేవలపై కొనియాడారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తితో పాటు సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య,కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు బంక చందు,కౌన్సిలర్లు మ్యాదరబోయిన శ్రీనివాస్, వల్లపు రాజు, పున్న లావణ్యసది, యూత్ అధ్యక్షులు చెన్నవేని విద్యాసాగర్, ఎండి హస్సన్, బూరుగు సతీష్, పచ్చిమట్ల నరసయ్యగౌడ్, జల్ల రమేష్, బూరుగు కిష్టస్వామి, కమలహాసన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ యువజనోత్సవాలకు దేవక్కపల్లి యువకుడు

**బెజ్జంకి, జనవరి 11, ప్రభాతవార్త :** జాతీయ యువజనోత్సవాలకు మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామానికి చెందిన సోరుపాక అనిల్‌కుమార్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మూల రంజిత్‌రెడ్డి, కార్యక్రమఅధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వశాఖ అధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ ధార్వాట్ పట్టణాలలో ఈనెల 12 నుంచి 16 వరకు జరగనున్న 26వ జాతీయ యువజనోత్సవాలకు జిల్లా నుంచి అనిల్‌కుమార్ ఎంపికయ్యారని తెలిపారు.ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సంప్రదాయ, బతుకమ్మ, బోనాలు, వంటకాలు, కబడ్డీ, దేశీయ అటలు, యువ చర్చాగోష్టి, సాంస్కృతిక విభాగానికి యూత్ మీట్‌లో ప్రదరి ్శచనున్నారని తెలిపారు.

## మైనార్టీ హాస్టల్‌లో మ్యాత్స్ ఎక్స్‌పో



మ్యాత్స్ ఎక్స్‌పో షోను సందర్శిస్తున్న దృశ్యం

**దుబ్బాక, జనవరి 11, ప్రభాతవార్త:** దుబ్బాక మైనార్టీ హాస్టల్‌లో మ్యాత్స్ ఎక్స్‌పో కార్యాక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ జీ.విమలరెడ్డి తెలిపారు. బుధవారం దుబ్బాకలో మైనార్టీ హాస్టల్ విద్యార్థులు తమ ప్రతిభను మ్యాస్ ఎక్స్‌పో కార్యక్రమం ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రానికి దుబ్బాక మండల మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఆస స్వామిలు ముఖ్యాతిథిగా హాజరైయారు. విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన ప్రదర్శినను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ నహిమ్ముద్దిన్, డిఎంబ్యూఓ గోపాల్ రావు, ఆర్ఎల్‌సి నర్సింలు, ప్రధానోపాధ్యాలు, సిబ్బంది, తల్లిదండ్రులు, మజీద్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొండపాక, జనవరి 11, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన బైండ్ల బాల్‌నర్సయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపిటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ॥ 5 వేలు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొల రవీందర్ ॥ 2 వేలు అందించారు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో మానవత దృక్పదంతో వ్యక్తి గత సహాయం చేసినట్లు వారు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసీ భూములు గౌడ్, మాజీ ఎంపిటిసీ ఇండ్ల కనకయ్య, వార్డు సభ్యులు రాజు, కనకయ్య, నాయకులు బక్కని యాదయ్య, మలిగి శంకరయ్య, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట వివనాలు నమోదు చేసుకోవాలి : ఎవో



ఆయిల్‌ఫామ్ పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగేందర్‌రెడ్డి

**మర్కుక్, జనవరి 11 (ప్రభాతవార్త):** యాసంగిలో సాగు చేస్తున్న పంటలను రైతులు నమోదుచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎర్రవల్లి, దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు ద్వారా గిట్టుబాటుధరతో పాటు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అందజేసే రైతుబంధు, రైతుబీమా పథకాలకు ఉపయోగపడుతుందని, తప్పకుండా ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఆయిల్‌ఫామ్ సాగుతో లాభాలు**

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్‌ఫామ్ తోటలకు మొగ్గు చూపాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రజినికాంత్, అశ్విని, రైతులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**-ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దాకూరి సంపత్**

**జగదేవ్‌పూర్, జనవరి 11 (ప్రభాతవార్త):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దాకూరి సంపత్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ కళాశాలలో 250 మంది విద్యార్థిని, విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి విద్యనభ్యసిస్తున్నారని, వారికి కావాల్సిన కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.కనీసం విద్యార్థులకు శౌచాలయాలు సరిపడా లేవని, బోధన, బోధనేతర సిబ్బంది లేరని చెప్పారు. సమయాను కూలంగా బస్సులు లేకపోవడంవల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రమేష్, శ్రీను, అరవింద్, మహేష్ పాల్గొన్నారు.

## దేశబోయిని నర్సింలుకు సన్మానం

**గజ్వేల్, జనవరి 11 (ప్రభాతవార్త):** జిల్లా, రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డులతోపాటు భారత ప్రభుత్వంద్వారా 2011 సంవత్సరంలో జాతీయ యువజన అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకొని సార్క్ కూటమి ద్వారా అంతర్జాతీయ యువజన అవార్డుకు 2012లో భారతదేశం తరపున నామినెట్ అయిన గజ్వేల్ వాసి దేశబోయిని నర్సింలును హైద్రాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర యువజన ఉత్సవాల ముగింపు సమావేశంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఐఏఎస్ ఘనంగా సన్మానించారు.

## పెరిగిన చలి తీవ్రత.. జాగ్రత్తలు పాటించాలి

**-ఝరాసంగం పిహెచ్‌సి డాక్టర్ రమ్య**

**ఝరాసంగం, జనవరి 11, ప్రభాతవార్త:** చలి తీవ్రత పెరిగిందని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తూ రోజులను వెల్లదీయాల్సిన అవసరం ఉందని మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రమ్య సూచించారు. బుధవారం డాక్టర్ పద్మ ప్రభాతవార్తతో మాట్లాడుతూ చిన్నారులు, వృద్దులు చలిలో తిరిగాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రిళ్ల వెచ్చగా ఉండాలని సూచించారు. భోజనంలో వేడి పదార్థాలను తీసుకోవాలని, కషాయం సేవించాలని వివరించారు. లంగ్స్ వ్యాధితో అవస్థలు పడుతున్న వారు అతిజాగ్రత్తగా ఉండాలని అండాలన్నారు.

## ఎంపిడిఓకు ప్రజాప్రతినిధుల సన్మానం



ఎంపిడిఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధుల దృశ్యం

**న్యాల్‌కల్, జనవరి 11, ప్రభాతవార్త:** మండలానికి ఎంపిడిఓగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక మండల కేంద్రంలో నిర్వహించిన మొదటి సమావేశంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బుధవారం కంటి వెలుగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపితో పాటు జడ్పీటిసి సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరై ఎంపిడిఓను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మండలాభివృద్ధికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి అంజమ్మ, ఉపాధ్యక్షులు గౌసొద్దిన్, జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు విజ్ఞాన, వినోద భరిత కోర్సులు నేర్పడం మంచిది

**పాఠశాల చైర్మన్ ఆంథోనిరెడ్డి**



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 11, ప్రభాతవార్త:** పిల్లలకు మంచి విద్యాబోధన జరిపించడంతో పాటు వారి అభిరుచులను బట్టి విజ్ఞాన, వినోద భరిత కోర్సులను కూడా నేర్పించడం వల్ల మరింత రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయని సెయింట్ ఆంథోని పాఠశాల చైర్మన్ ఆంథోనిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో ఎస్‌కెజి విద్యార్థినీ చిన్నారి మేకల సహస్రరెడ్డి త్యాగరాయగాన సభలో 99వ జాతీయ నృత్య మహోత్సవ పోటీల్లో శ్రీకృష్ణుడి పాత్రలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి బంగారు తెలంగాణ ఫోక్ అకాడమీ ద్వారా అందుకున్న మెమొంటో , ప్రశంసా పత్రాన్ని పాఠశాల వేదికపై తమ చేతుల మీదుగా అందించి చిన్నారిని అభినందించారు. మాతృభాషతో పాటు విద్యార్థులు పాశ్చాత్య భాష యగు ఇంగ్లీషును తరగతి గదిలోనే కాకుండా నిత్య జీవితంలో ఉపయోగించడం ద్వారా భాషపై పట్టు సాధిస్తారని సూచించారు. చైర్మన్ అంథోనిరెడ్డితో పాటు ప్రిన్సిపాల్ శోభారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించిన వారిలో ఉన్నారు.

## సభ్యులకు ఘన సన్మానం



బాధ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, జనవరి 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ టీయుడబ్ల్యుజే యూనియన్ సభ్యులను బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీయుడ బ్ల్యూజే- ఐజేయు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సిద్దన్నపాటిల్, జహీరా బాద్ నూతన అధ్యక్షులు మీనాజ్, ఉపాధ్యక్షులు మాణిక్ పాటిల్, రాజేష్, ఎంపి సంతోష్ పాటిల్, సాహాయ కార్యదర్శి సిహెచ్ మహేష్, సభ్యులో సోమయ్య స్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం పాఠకులకు విధితమే. ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం బాద్యులను మండల ప్రెస్ క్లబ్ బాధ్యులు సుధాకర్, సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్, రాజ్ శేఖర్, చిరంజీవి, సంగమేశ్వర్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ఇంచార్జ్ సర్పంచ్‌కి సన్మానం



ఇంఛార్జ్ సర్పంచ్‌ని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులుల

**గుమ్మడిదల, జనవరి 11, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో నూతనంగా ఎన్నికైనా ఇన్చార్జ్ సర్పంచ్ మేడిపల్లి మురళిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మాజీ సర్పంచ్ జయశంకర్ గౌడ్, గడ్డం రాజు, ఎంపీటీసీ మద్ది మల్లమ్మ, సాయికుమార్, కాంగ్రెస్ నాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతరిస్తున్న కళలను నిలిపిన సంస్కృతి

**పటాన్‌చెరు, జనవరి 11, ప్రభాతవార్త:** అంతరించిపోతునన భారతీయ కళల వేడుకలను "సంస్కృతి" పేరిట గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్) విద్యార్థులు సగర్వంగా నిర్వహించారు. తమ విద్యా సంస్థలోని విద్యార్థులు, అధ్యాపకులలో నిబిడీకృతంగా ఉన్న కళాకారులను కళ, కవిత్వం వంటి పోటీల నిర్వహణ ద్వారా వెలితీశారు. అంతేగాక, భారతీయ కళల స్థితిపై అభిప్రాయాలను తెలియజేయడానికి యువతకు నృత్యం పోటీలను నిర్వహించారు. "పొట్టి సినిమా" (షార్ట్ ఫిల్మ్) పేరిట నిర్వహించిన పోటీకి ఔత్సాహికులను ఆహ్వానించగా, దాదాపు 43 మంది భారీ బాగస్వామ్యంతో విశేష ఆదరణ లభించింది. హిట్‌వర్స్ సృష్టికర్త డాక్టర్ శైలేష్ కొలను, ప్రముఖ టాలీవుడ్ నటి శ్రీవిద్యా మహర్షి, పాత్రికేయురాలు ప్రేమమాలిని, గాయని లాలసలను సంస్కృతి వేదికపై సత్కరించారు. మొత్తంగా ఈ వేడుక శాస్త్రీయ ప్రదర్శనలు, అనుకరించేలి గాయని లాసలను సంస్కతి వేదికపై సత్కరించారు. మనదేశంలోని చేనేత కళాకారులకు మద్దతునిస్తూ విద్యార్థులు చేనేత దుస్తులు ధరించి ఈ వేడుకలలో పాల్గొనడం విశేషం.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కంటి వెలుగు కార్యక్రమంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి



కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పిహెచ్‌సి డాక్టర్ శ్వేతప్రియ



కంటి వెలుగుపై అవగాహన కల్పిస్తున్న జడ్పీటిసి గరుగుబాయి రాందాస్

# రెండో విడత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**సంగారెడ్డి, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు చొరవ చూపాలని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం నాగల్‌గిద్దలోని కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపిపి అధ్యక్షులు మోతిబాయి రాథోడ్, ఉపాధ్యక్షులు పండరియాదవ్, జడ్పీటిసి సభ్యులు రాజు రాథోడ్, ఆత్మ కమిటి డైరెక్టర్ నాగిశెట్టి పాటిల్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మైత్రి పండరి, వైద్యాధికారి జువేరియా బేగం, ఎస్ఐ ధశరత్, సర్పంచులు సంజీవరెడ్డి, అంజిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**మనూర్‌లో..**

**సంగారెడ్డి, జనవరి 11, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తారీఖు నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మనూర్‌లోని రైతు వేదికలో కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయక్ష మోహన్‌రెడ్డి, ఎంపిడిఓషాజీలోద్దిన్, డాక్టర్ రవికుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావుపాటిల్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ తాజుద్దీన్, సర్పంచులు నాగప్ప మాలిపాటిల్, రాజేందర్‌రావు, కవిత, అంబికా నర్సింలు, అనిత సుధాకర్, తుల్జమ్మ సిద్దేశ్వర్, ముస్తాన్‌రావు, నర్సింలు, కో-ఆప్షన్ సభ్యులు సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్‌లో..**

**న్యాల్‌కల్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభ్యుం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవలని న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు ఏ శ్వేతప్రియ, నరేందర్‌లు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 18ద తారీఖు నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్జీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్ మాట్లాడుతూ భారత దేశంలోనే మరే రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమం అమలు కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవతో 250 కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ, వైస్ ఎంపిపి గౌసొద్దిన్, ఎంపిఓ సురేష్ పాల్గొన్నారు.

**జహీరాబాద్ (కోహీర్)లో..**

**సంగారెడ్డి , జనవరి 11, ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటితో అవస్థలు పడుతున్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జడ్పీటిసి సభ్యులు గరుగుబాయి రాందాస్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జడ్పీటిసి మాట్లాడుతూ నిరుపేదలు కంటి సమస్యలతో సతమవతున్నట్లు గమనించి కార్పోరేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకునే స్థిత గతులు లేవని గుర్తించి రాష్ట్రంలో ప్రతి గ్రామంలో కార్యక్రమం నిర్వహించేలా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖ ర్‌రావుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఈ నెల 18వ తారీఖు నుంచి రెండవ విడత కార్యక్రమం ప్రారంభం అవు తుందని, త్రపి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తమవంతు సహ కరించాలని సూచించారు. ఎంపిపి మాధవి, ఎంపిడిఓ సుజాత నాయక్, ఇంచార్జి ఎంపిఓ విజయ్‌కుమార్, వైద్యులు నవీన్‌కుమార్, మనుజరెడ్డి పాల్గొన్నారు.

**అమీన్‌పూర్‌లో..**

**అమీన్‌పూర్, జనవరి 11, ప్రభాతవార్త:** అమీన్‌పూర్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ కమీషనర్ సుజాతల అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు సన్నహాక సమావేశంలో చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి మే 17వ తేదీ వరకు ప్రతి వార్డులో నిర్వహించబోయే 100రోజుల రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 18సంవత్సరాల పైబడిన వారందరికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్ళజోడు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. కావున వార్డు కౌన్సిలర్లు తమతమ వార్డులలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకునే విధంగా చూడాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మెడికల్ ఆఫీసర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తిదొంగలను పట్టుకున్న గ్రామస్థులు



పత్తిదొంగలను పట్టుకుని వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్ఐ దేవిదాస్

**అల్లాదుర్గం, జనవరి 11, ప్రభాతవార్త:** ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో దాచుకున్న పత్తిపంటను దొంగిలించిన ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దా పూర్ గ్రామంలో జరిగిది. వివరాల్లోకి వెళ్ళితే గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన ఆకుల జనార్ధన్ ఇంట్లో దాసుచుకున్న పత్తిపంట 50 కిలోలకు పైగా అపహరించినట్లు అలాగే బచ్చు అశోక్ ఇంటి నుండి ఒక క్వింటల్ 50 కిలోల పత్తిని దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నిర్జప్లా శ్రీనివాస్, ఇందూరి బిరప్పలు కలిసి ఈ దొంగతానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. బచ్చు రమేష్ పాత ఇంట్లో ఇందూరి బిరప్ప అనే వ్యక్తి అద్దెకు నివాసం ఉంటున్నాడు. మంగళవారం నాడు అర్ధరాత్రి సమయంలో బీరప్ప, శ్రీనివాస్‌లు కలిపి బచ్చు అశోక్ ఇంటి తాలలు పగలగొట్టి పత్తిపంటను దొంగిలించే సమయంలో దొంగ చేతికి గాయాలై రక్తపుబొట్ల గుర్తులు నేలపై కనిపించాయి. తెల్లవారు జాము న బాధితులు చూసి తమ ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. బాధితులు, గ్రామస్థులకు కలిపి తెల్లవారు జామున దొంగతనం జరిగిన స్థలం నుండి కనిపిం చిన రక్తపు బొట్లు ఆధారాలతో వెతకగా పక్కింట్లో నివాసం ఉంటున్న ఇందూరి బిరప్ప ఇంటి వరకు రక్తపు బొట్లు కనిపించడంతో దొంగతనం బిరప్పనే చేశాడంటూ గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థులు బిరప్పకు దేహశుద్ధి చేయడంతో నిర్జప్లా శ్రీనివాస్ కూడా తనకు తొడు ఉన్నాడని తెలపడంతో బిరప్ప, శ్రీనివాస్‌లను గ్రామ స్థులు, బాధితులు దేహశుద్ధి చేసి గ్రామపంచాయతీలో నిర్బం దించారు. పత్తిపం టను దొంగలించిన దొంగలు ఊరు బయట పత్తిని పంచుకున్నట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఈ ఇద్దరు దొంగలతో పాటు మరో ముగ్గురు కూడా దొంగతనానికి పాల్పడినట్లు వారు గ్రామస్థులకు తెలిపారు. ఈ పత్తిపంటను దొంగిలించుకొని ఊరు మధ్యనుండి పోతే సిసి కెమెరాల్లో తమ ఫోటోలు పడుతా యని పంట చెనుల మధ్య నుండి రోడ్డుకు చేరుకున్నట్లు పత్తిదొంగతనం చేసిన దొంగలు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారాన్ని అందించడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బిరప్ప, శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకొని ప్రజల ముందే విచారించగా మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నాట్లు వారు తెలిపారు. బాధితులు అశోక్, జనార్ధన్‌ల ఫిర్యాదు మేరకు అల్లాదుర్గం ఎఎస్ఐ దేవిదాస్ కేసు నమోదుచేసి తెలిపారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, తదితరులు

**సంగారెడ్డి, జనవరి 11, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రేగోడ్‌లో జాతీయ యువజన క్రీడోత్సవాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్ఐ సత్యనారాయణ మండల నాయకులతో కలిసి క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, షటిల్, చెస్ పోటీలలో మండల స్థాయి యువ ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాలు మానసికోల్లాసం కలుగుతుందని నాయకులు తెలిపారు. యువకులు తమకు ఉన్న క్రీడా ప్రతిభను చాటుకుని మంచిపేరును గడించాలని ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తితో ప్రతి ఒక్క క్రీడాకారుడు మెలగాలని ఆయన సూచించారు. అంతేకాకుండా క్రీడల ద్వారా విద్యార్థులలో మానసికోల్లాసం, శరీర ధారుఢ్యం పెరుగుతాయని, తద్వారా విద్యలో కూడా విశేషకంగా రాణించ డానికి ఆస్కారముంటుందని ఆయన కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, సర్పంచ్‌లు రమేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం

**కంగ్టి, జనవరి11 ప్రభాతవార్త:** కృషి విజ్ఞాన కేంద్రం జహీరాబాద్ వారి సహకారంతో కంగ్టి మండల పరిధిలోని నాగూర్(కె) గ్రామంలో బుధవారం రైతులకు పంటల సాగుపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా శాస్త్రవేత్తలు జడిగె సురేష్, రమేష్, స్నేహలతలు రైతులకు పత్తి, కందుల సాగుపై శిక్షణ ఇస్తూ పాటించాల్సిన నియమాలను సూచించారు. సేంద్రీయ ఎరువులు వాడటం ద్వారా చీడపురుగుల ఉధృతిని అరికట్టవచ్చని, పంచామృతం, జీవామృతం, సేంద్రీయ ఎరువులను ఎక్కువ మోతాదులో వాడాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాన్ని పొందాలన్నారు. ప్రతి రైతు తన పొలంలో కంపోస్టు ఎరువును తయారు చేసుకోవాలని సూచించారు. పత్తి పంటపై చీడపీడల ఉధృతి ఉందని, సేంద్రీయ ఎరువుల వాడకంతో అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి గతంలో వారు వేసిన పంటలను, లాభాశాతాన్ని అడిగి తెలుసుకొని సాగు చేయాల్సిన పద్ధతిని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నీలమ్మ ఈరప్ప, ఉప సర్పంచి అశోక్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మహానంద, వాటర్ సంస్థ మేనేజర్ రవిప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్, గుండప్ప, గ్రామ రైతులు నర్సప్ప, శరణప్ప పాటిల్, కాశీనాథ్ పాటిల్, సంగప్ప పాటిల్, పండరి హస్లే, ధన్‌రాజ్ అట్లూరే తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం స్వీకారం చేస్తున్న మేడిపల్లి మురళి

## అన్నారం తాత్కాలిక సర్పంచ్‌గా మేడిపల్లి మురళి

**ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడుతా**

**గుమ్మడిదల, జనవరి 11, ప్రభాతవార్త:** గత కొద్దిరోజులుగా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం అంశమై ఇటీవల కాలంలో సస్పెండ్ అయిన సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెండ్ కాగా ఎట్టకేలకు ఉత్కంఠ భరితంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్నారం గ్రామంకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది. ఇట్టి అంశమై అధికారులు నిర్ణయం మేరకు బుధవారం గ్రామ తాత్కాలిక సర్పంచ్‌గా ఉపసర్పంచ్ మేడిపల్లి మురళి, ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రమాణస్వీకరాం చేయించడం జరిగింది. చెక్ పవర్ అంశమై వార్డు మెంబరు సంగం శేఖర్ గౌడ్, మరొకటి అధికారి ఎంపిడివో చంద్రశేఖర్‌కు కేటాయించి విధులు నిర్వర్తించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్బంగా ఎన్నుకోబడిన తాత్కాలిక సర్పంచ్ మేడిపల్లి మురళి ప్రమాణ స్వీకారానంతం మాట్లాడుతూ గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్థులు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తానని ఆవసరమైతే తన సొంత నిధులు కూడా కేటాయించి అభివృద్ధిలో పాలుపంచుకుంటానని తెలిపారు. కార్య నిర్వహణ అధికారి సుదర్శన్ ఎంపిటీసీ బేకరీ లక్ష్మి, మద్ది మల్లమ్మ, గ్రామస్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్స్ నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇసుక

**- కాంట్రాక్టరుతో కుమ్మక్కై అమ్ముకుంటున్న గ్రామ పాలకమండలి**



ఇసుకను అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్న గ్రామస్థులు

**పటాన్‌చెరువు, జనవరి 11, ప్రభాతవార్త:** నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ పథకం అమలులో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. విషయానికొస్తే ఈ పథకంలో తొలివిడలో భాగంగా జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామానికి 50 ఇండ్లు మంజూరు చేశారు. పలు కారణాలవల్ల చాలా కాలం జాప్యం జరగ్గా.. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సర్వే నెంబర్ 5 లో డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణానికై శంకుస్థాపన చేశారు. ఇది జరిగిన సుమారు మూడున్నరేళ్ల గడిచిన ఆ నిర్మాణాలు పూర్తికాకపోగా.. పాక్షికంగా నిర్మాణంగా పూర్తిఅయినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదిలా ఉంటే సంబంధిత కాంట్రాక్టర్లకు నిర్మాణ వ్యయం భారం అవుతున్నందున ప్రభుత్వమే ఇసుకను రాయితీ ద్వారా అందజేసింది. అయితే స్థానిక గ్రామపాలక మండలి.. సదురు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై యథేచ్ఛగా ప్రభుత్వ ఇసుకను అమ్ముకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అంతేకాదు సుమారు 2 వందల టన్నుల ఇసుకను గ్రామంలోని సీసీ రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌కి, అలాగే ప్రైవేట్ వ్యక్తుల ఇంటి నిర్మాణాలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో గ్రామ పాలకుల హస్తం ఉందని పలు మార్లు సర్పంచ్, ఉప సర్పంచ్ దృష్టికి వచ్చినా వారు మాకు తెలియదని తప్పు కుంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని గ్రామస్థులు దుబ్బ శ్రీనివాస్, వెంకటేష్, నాగరాజు, ఆంజనేయులు, రాజు తదితరులు కోరారు.

**పబ్లిక్ హెల్త్, మున్సిపల్ డబుల్ బెడ్ రూం**

ఎగ్జిక్యూటీవ్ ఇంజనిరింగ్ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం రాయితీ ద్వారా ఇసుకను, సిమెంట్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తుందని, దానిని అమ్ముకోవడానికి ఎలాంటి అనుమతులు లేవని సదురు ఎవరైన అమ్ముకుంటే మాపై అధికారులకు నివేదిక పంపి పైఅధికారుల ఆదేశాలానుసరం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

**వైగురు గురూస్ హెలీషా**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్డునెం.25ను తరచూసోషల్ సర్కిల్స్‌లో బిలియనీర్స్ రోడ్‌గా వ్యవహరిసు ంటారు. అలాంటి చోట ఇప్పుడు ఓ కొత్త ఆవాసం వెలిసింది. అందులోకి సెల్ కాన్ చైర్మన్ వైగురు నూతనగృహ ప్రవేశం చేశారు. అదిఐదు అంతస్తుల భవనం. దాని పేరు గురూస్ హెలీషా విలాస వంతమైన లోకేషన్‌లో ఇది నెలకొంది. గృహప్ర వేశానికి హాజరైన ప్రముఖుల్లో పిపి రెడ్డి, కిరణ్‌చెరుకూరి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సీఎం రమేష్,ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ తారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదు

**జెడ్పీటీసీ కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, జనవరి 11, ప్రభాతవార్త:** నిరంతరం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుండి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహి పాల్‌రెడ్డి పరిష్కరిస్తుంటే ఓర్వలేక బిజెపి నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేపై బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ పద్ధతినిక మానుకోవాలని దమ్ము ధైర్యం ఉంటే ప్రజల సమస్యలు పరిష్కరించి ప్రజాక్షేత్రంలో వెళ్లాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరిం చారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, జెడ్పిటీసీ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే టి నందీశ్వర్ గౌడ్ హాయంలోనే అన్నారం 261 సర్వే నెంబర్లు ఎన్నో అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయడంలో ఆలస్యమైన పూర్తి చేస్తున్నామని సూచించారు. ఇకపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఎం నరేందర్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, తిరుమల వాసు, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి సంజీవరెడ్డి, వినోద్ గౌడ్, పోన్నపోయిన వేణు, గ్రామ వార్డు సభ్యులు సంఘం శేఖర్ గౌడ్, దర్గా శ్రీనివాస్, నరహరి, మాజీ ఉపసర్పం చ్ తుపాకులు రాజు, దర్గా బిక్షపతి పాల్గొన్నారు.

## మీలో ఒకడిగా ఉంటా : జంగం గోపి

**సంగారెడ్డి, జనవరి 11, ప్రభాతవార్త:** ప్రజలతో కలిసి మీలో ఒకడిగా ఉంటానని జహీరాబాద్ బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి జంగం గోపి అన్నారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్లఓ అప్పం శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జంగం గోపి ముఖ్య ఆహ్వానితులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన జంగం గోపిని మహిళలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్బంగా జంగం గోపి మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసిన శాంతినగర్ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో మరిన్ని ఓట్లు వేసి తనను శాసన సభ తలుపులు తట్టేలా ఆశీర్వదించాలని వినతి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, సమాజ సేవే లక్ష్యంగా పనులు చేస్తానని హామి చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ల ఆవిష్కరణ

**పటాన్‌చెరు, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఐక్య పట్టణ, గ్రామీణ ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణను బుధవారం నాడు ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజ్, పటాన్‌చెరు నియోజకవర్గంలో బుధవారం రోజున తెలంగాణ రాష్ట్ర ఐక్య పట్టణ గ్రామీణ ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవేందర్ రాజు పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కన్న శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసుధన్, రాష్ట్ర కార్యదర్శి, ఎం రమేష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి బిక్షం గౌడ్, జెపిలయన్స్ క్లబ్ ట్రేసరర్ అమరేందర్, ఆర్ఎంపి జిల్లా కార్యదర్శి నర్సింలు, పటాన్‌చెరువు అధ్యక్షులు దత్తయ్య, ఉపాధ్యక్షులు హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు భారతీ బాయి, ఇందిరా పాల్గొన్నారు.

## అక్రమ కలప పట్టుకున్న ఫారెస్ట్ రెంజ్ అధికారులు

**అల్లాదుర్గం, జనవరి 11, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని అక్రమంగా తరలిస్తున్న అక్రమ కలప (నిలగిరి) పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం నాడు మండలంలోని సీతానగర్ గ్రామశివారులో నిల్వచేసి ఉన్న అక్రమ కలపను (నిలగిరి) కట్టెలను లారీలలో తలరిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకొని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి సీతానగర్ గ్రామ శివారులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న కలన (నిలగిరి) కట్టెలతో నిండిన లారీని చిన్నశంకరంపేట మండలానికి తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఫారెస్ట్‌రేంజ్ అధికారులు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న నిలగిరి కట్టెలతో పాటు టిఎస్ 15యుఎ 7479 గల నెంబర్ గల లారీని స్వాధీనం చేసుకొని, కట్టెల వ్యాపారి జంపయ్యను అదులోకి తీసుకున్నట్లు తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం అక్రమ కట్టెలను తరలిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని వారు తెలిపారు.

**నాణ్యతా ప్రమాణాలపై దృష్టి ఎడెల్వీస్ టోకియో**

దీర్ఘకాలిక వృద్ధికోసం నాణ్యతా ప్రమాణాలు బలోపేతం చేయడంపై దృష్టిసారించామని ఎడెల్వీస్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రజిత్ ముఖోపాధ్యాయ తెలిపారు. ఈ లక్ష్యం దిశగా కస్టమర్, పంపిణీదారుల ఆనందం కోసం ప్రాసెస్ అప్టిమైజేషన్‌కు ప్రాధాన్య తనిస్తోందని పేర్కొన్నారు. ప్రాథమికంగా నాలుగు నాణ్యతా ప్రమాణాలు కలవన్నారు. ఇవి క్లెయిన్ సెటిల్‌మెంట్ రేషియో పెర్సిస్టెన్సీ రేషియో గ్రీవెన్స్ రేషియో నెట్ ప్రమోటర్‌స్కోర్ మావ్యాపార పట్టితకు సూచికలుగా ఉన్నాయన్నారు.